క్లుప్తంగా

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


సుజాతకుమారి, జిల్లా ఉద్యానశాఖాధికారి

రాజమహేంద్రవరం రూరల్: వాతావరణ ఆధారిత పంట బీమా పథకాన్ని జిల్లాలోని జీడి మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి బి.సుజాతకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన 2016లో ప్రారంభించారన్నారు. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం జీడిమామిడి రైతులకు అండగా నిలవాలని బీమా పథకం అమలు చేస్తుందన్నారు. జిల్లాకు జీడిమామిడి బీమా చేయడానికి ఇఫ్‌కో–టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి కేటాయించాన్నారు. ఒక ఎకరాకు రైతు రూ.1,500 చెల్లించాలన్నారు. గరిష్ట పరిమితి ఏమి లేదన్నారు. ఈకేవైసీలో నమోదు చేసుకునే విస్తీర్ణానికి అనుగుణంగా ఈ నెల 15వతేదీలోగా చెల్లించాలన్నారు. పథకం వివరాల కోసం కంపెనీ ప్రతినిధి ఎస్.రాజ్‌కుమార్ ఫోన్ నంబర్ 92900 33325లో సంప్రదించాలన్నారు. అలాగే గ్రామ స్థాయిలో రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న వీఏఏ, వీహెచ్ఏలను సంప్రదించవచ్చన్నారు. జిల్లాలో 19,784 ఎకరాల జీడిమామిడితోటలు, 6,910 మంది రైతులు ఉన్నారన్నారు. జీడిమామిడి తోటల రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖాధికారి బి.సుజాతకుమారి తెలిపారు.

టీటీడీ బోర్డు సభ్యుడిగా ఎంపికపై హర్షం

రాజమహేంద్రవరం సిటీ: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యుడిగా విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన సినీ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి నియామకంపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు పాడుగు శ్రీను హర్షం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న ఆనంద్ సాయికి ఎంతో ప్రాముఖ్యత కలిగిన టీటీడీ బోర్డు డైరెక్టర్ పదవి ఇవ్వడం విశ్వ బ్రాహ్మణులకు పెద్దపీట వేసినట్లేనని అన్నారు.

కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్‌కు ఎంపీ

రాజమహేంద్రవరం సిటీ: కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఇండియా రీజియన్ స్టీరింగ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి శనివారం ఆస్ట్రేలియాకు బయలుదేరి వెళ్లారు. అక్కడ జరిగే 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ (సీపీసీ)లో 50కి పైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతుండగా, మన దేశం నుంచి ఎంపీ పాల్గొంటున్నారు. ప్రపంచంలో మహిళలు ఎదుర్కొనే వివిధ సమస్యలపై చర్చించడంతో పాటు మహిళల ప్రాతినిధ్యం పెంపు తదితర సమస్యలపై మాట్లాడతారు. ఈ నెల 10వ తేదీ వరకూ ఆస్ట్రేలియాలో జరిగే సమావేశాల్లో పాల్గొని, 11న మన దేశానికి చేరుకుంటారని ఎంపీ కార్యాలయం పేర్కొంది.

అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాల మంజూరు

సీటీఆర్ఐ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోనే తొలిసారిగా రాజమహేంద్రవరంలో అన్‌–ఎయిడెడ్ జూనియర్ కళాశాల ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అక్షరశ్రీ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ ఈ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి లభించిందని తెలిపారు. శనివారం తిలక్ రోడ్డులోని అక్షరశ్రీ విద్యా సంస్థలో కరస్పాండెంట్ టి.నాగరత్నం, కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విలేకరులతో మాట్లాడారు.

రోడ్లకు మరమ్మతులు

కడియం: వాహనదారులకు ఇబ్బందుల్లేకుండా రోడ్లపై గుంతలను పూడ్చుతున్నామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శనివారం మిషనల్‌పాటోల్‌ఫ్రీ ఏపీ కార్యక్రమాన్ని కడియపుసావరంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. కడియం మండలంలో కొన్ని రోడ్లను రూ.88 లక్షలతో మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, నాయకులు మార్గాని సత్యనారాయణ, పంతం గణపతి, వరగోగుల సత్యనారాయణ, వరగోగుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

కడియం: హత్యాచారానికి గురైన రౌతు కస్తూరి కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శనివారం ఆయన బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కేసు దర్యాప్తులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కడియం: జేగురుపాడులో రైతుసేవా భవనంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ఉచిత గ్యాస్ సిలెండర్ పథకాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆనందం

- కార్తికమాస ఆతిథ్యానికి కేరాఫ్ అడ్రస్ ధవళేశ్వరం
- బ్యారేజీ, మ్యూజియం, దొరగారి బంగ్లాలకు ప్రత్యేకత


ధవళేశ్వరం కాటన్ మ్యూజియం

ధవళేశ్వరం: కార్తిక మాసం అంటేనే ఆహ్లాదం.. ఆనందం. అలాంటి ఆతిథ్యానికి ధవళేశ్వరం కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. కాటన్ బ్యారేజీ, మ్యూజియం, దొరగారి బంగ్లాలకు ఏటా సందర్శకుల తాకిడి ఉంటోంది. కార్తిక మాసంలో స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు, సంఘీయులతో సరదాగా గడపవచ్చని ప్రతి ఒక్కరిలో ఉంటోంది. ఈ మాసంలో తమకిష్టమైన ప్రదేశాలకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. ఆహ్లాదంతో పాటు విజ్ఞానాన్ని పంచేందుకు ధవళేశ్వరం ఆహ్వానం పలుకుతోంది. కాటన్ బ్యారేజీ, మ్యూజియం, దొరగారి బంగ్లాతో పాటు సమీపంలోని కడియం నర్సరీలకు కార్తిక మాసంలో అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు.

పర్యాటకులతో కిటకిట

ఒకపక్క గోదావరి అందాలు, మరోపక్క విజ్ఞానాన్ని అందించే కాటన్ మ్యూజియం కార్తిక మాసంలో పర్యాటకులతో కిటకిటలాడుతుంది. ఈ మ్యూజియంలో ఆనకట్ట నిర్మాణ విశేషాలు, గోదావరి నదీ ప్రవాహ స్వరూపాలను వివరిస్తూ నమూనాలను పొందుపరిచారు. దీంతో కాటన్ మ్యూజియం విజ్ఞాన, వినోదాల మేళవింపుగా విరాజిల్లుతుంది. 1984లో కాటన్ మ్యూజియాన్ని ప్రారంభించారు. ఇక్కడ ఒకపక్క ఆనకట్ట నిర్మాణ సమయంలో వినియోగించిన యంత్రాలు, పనిముట్లను సందర్శనకు ఉంచారు. మరోపక్క గోదావరి నది పుట్టుక నుంచి కడలిలో కలిసేవరకూ గోదావరి నమూనాలను మ్యూజియం ఆవరణలో ఏర్పాటు చేశారు. మ్యూజియం లోపల ఆనకట్ట నిర్మాణానికి ముందు ఈ ప్రాంతంలో నెలకొన్న కరవు పరిస్థితులను వివరిస్తూ చిత్రాలను పొందుపరిచారు. అదేవిధంగా ఈ ప్రాంతాన్ని అతలాకుతలం చేసిన 1986 వరదల సమయంలో నెలకొన్న పరిస్థితులకు ఫోటోలను కూడా కాటన్ మ్యూజియంలో సందర్శనకు ఉంచారు. కాటన్ జీవిత విశేషాలు కూడా కళ్లకు కట్టారు. మరోపక్క విద్యార్థులు ఆడుకునేందుకు ఆటవస్తువులను సైతం అందుబాటులో ఉంచారు. మనసుకు ఆహ్లాదాన్ని పంచేలా ఇక్కడ ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వరప్రదాయినిగా పేరొందిన కాటన్ బ్యారేజీ సందర్శన వినోదంతో పాటు విజ్ఞానాన్ని కూడా అందిస్తుంది. కాటన్ బ్యారేజీ సందర్శించే పర్యాటకులు బ్యారేజీ దిగువన ఇసుక తిన్నెల్లో స్నానాలు చేసేందుకు దిగితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. బ్యారేజీ దిగువ దొంగ ఊబులు ఉన్నందున పర్యాటకులు దిగువకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి

ఆటలాడుకునేందుకు..

ధవళేశ్వరంలోని దొరగారి బంగ్లాకు కార్తిక మాసంలో పర్యాటకులు పోటెత్తుతుంటారు. బంగ్లా ఆవరణలో దశాబ్దాల చరిత్ర కలిగిన ఊడల మర్రులు ఒక పక్క, పిల్లలకు ఆహ్లాదాన్ని పంచే ఆట వస్తువులు మరోపక్క పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. విశాలమైన ప్రదేశం ఉండటంతో వేలాది మంది రోజూ కార్తిక వన సమారాధనకు ఇక్కడకు వస్తుంటారు.

పచ్చని అందాలు

పర్యాటకులకు కడియం ప్రాంత నర్సరీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. హైవే నుంచి ప్రారంభమయ్యి దాదాపు 8 కిలోమీటర్ల లోపలి వరకూ కడియం మండలంలో వివిధ గ్రామాల్లో విస్తరించిన నర్సరీలు కనువిందు చేస్తాయి. ముఖ్యంగా కార్తిక మాసంలో వచ్చే సీజనల్స్, వివిధ రకాల ఆర్నమెంట్ మొక్కలతో ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తాయి. ఇక్కడ రకరకాల మొక్కల మధ్య సెల్ఫీలు దిగేందుకు ప్రతి ఒక్కరూ ఉత్సాహం చూపుతుంటారు.


మ్యూజియంలో ఆనకట్ట నిర్మాణ సమయంలో వినియోగించిన ఆవిరి యంత్రం


గోదావరి పుట్టుక నుంచి కడలిలో కలిసే వరకూ ఏర్పాటు చేసిన నమూనా

ప్రజా సేవకే జీవితం అంకితం



సభలో మాట్లాడుతున్న శివప్రసాద్ తదితరులు

సీటీఆర్ఐ: పడాల జీవితమంతా ప్రజా సేవకే అంకితమని అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అన్నారు. అరసం, అల్లూరి సీతారామరాజు యువజన సమితి, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ సంయుక్త నిర్వహణలో శనివారం సాహితీవేత్త పడాల వీరభద్రరావు సంతాప సభ ప్రసిద్ధ కవి ఎస్ఆర్ పృథ్వీ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన శివప్రసాద్ మాట్లాడుతూ తండ్రి పడాల రామారావు కీర్తిని వ్యాపింపజేశారని, అల్లూరి సీతారామరాజు జీవిత విశేషాలను పరిశోధించి వెలుగులోకి తెచ్చి, తన తండ్రి రాసిన 100 గ్రంథాలపై సాహిత్య అకాడమీ సౌజన్యంతో సెమినార్ కూడా జరిపారని అన్నారు. అరసం ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పడాల వ్యక్తిత్వం, నిబద్ధత, క్రమశిక్షణ, దీక్ష ఎంతో గొప్పదని ప్రస్తుతించారు. నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ, ఎస్‌కేవీటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబిల్ రాజబాబు, బట్టు శ్రీనివాసరాజు, ఆదిత్య కళాశాల డైరెక్టర్ గంగిరెడ్డి, మల్లెమొగ్గల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

సీటీఆర్ఐ: వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు విజయవాడలోని కుమ్మరిపాలెం ఈద్గా మైదానంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన వక్ఫ్ పరిరక్షణ మహాసభకు జిల్లా నుంచి వేలాదిగా ముస్లింలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు తరలిరావాలని వక్ఫ్ బోర్డ్ జిల్లా మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మొహమ్మద్ ఆరిఫ్ పిలుపునిచ్చారు. స్థానిక జాంపేటలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలో వచ్చిన నాటి నుండి ఎన్డీఏ ప్రభుత్వం ముస్లింలను అన్ని రకాలుగా నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. అందులో భాగంగా దేశవ్యాప్తంగా సుమారు 8 లక్షల ఎకరాల పైచిలుకు ఉన్న వక్ఫ్ ఆస్తులను ముస్లిమేతరులకు ధారాదత్తం చేసే విధంగా వివాదాస్పద సవరణ తీసుకొచ్చారన్నారు. దీనికి రాష్ట్రంలోని కూటమి ఎంపీలు మద్దతు ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ మహాసభ ద్వారా అన్ని పార్టీలు వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పార్లమెంట్లో ఓటు వేసేలా డిమాండ్ చేయాలని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్లమెంట్‌లోని ఉభయ సభలో వైఎస్సార్ సీపీ ఎంపీలు ఈ వివాదాస్పద చట్టాన్ని గట్టిగా వ్యతిరేకించారన్నారు.

యువతులు జాగ్రత్తలు పాటించాలి


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, పోలీస్ రక్షక్ సిబ్బంది

కడియం: ఆటో ప్రయాణాలు, మన ఇంటి పరిసరాల్లో పరిచయమున్న వాళ్లు, పరిచయం లేనివారి పట్ల యువతులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా మహిళా రక్షక్ టీం సభ్యులు తెలిపారు. స్థానిక ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికా రక్షణ అవగాహన సదస్సు హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలోనూ అనునిత్యం మహిళలపై ఎన్నో అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయురాలు పి.శ్రీ వెంకటదుర్గ మాట్లాడుతూ ఎవరిని గుడ్డిగా నమ్మవద్దన్నారు. బి.సువర్ణవేణి మాట్లాడుతూ చదువుపై మాత్రమే దృష్టి ఉంచి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. అనంతరం విద్యార్థినులు లావణ్య, ఝాన్సీ, పవిత్ర మాట్లాడుతూ ఆడపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి కఠినమైన శిక్షలు అమలు చేయాలని కోరారు. కడియం స్టేషన్ పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు వీరబాబు, నాగేశ్వరరావు, కోటేశ్వరి పాల్గొన్నారు.

మహిళల భద్రతపై శ్రద్ధ వహించాలి

కడియం: నర్సరీల్లో పనిచేసే మహిళల భద్రత పట్ల అంతా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిశోర్ సూచించారు. మండలంలోని కడియపులంకలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నర్సరీ రైతులతో శనివారం రాత్రి డీఎస్పీ సమావేశమయ్యారు. ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ పని నుంచి వచ్చి, వెళ్లే మహిళలు అందరూ కలసి రావాలన్నారు. అలాగే నర్సరీల్లో పనిచేసేందుకు వచ్చే మగవారి ప్రవర్తనపై నిఘా ఉంచాలన్నారు. చిన్న పిల్లలను నర్సరీ పనుల్లో పెట్టుకోవద్దన్నారు. నర్సరీ రైతులు, కడియం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


సంఘం రూరల్ తాలూకా యూనిట్ సభ్యులను అభినందించిన జిల్లా కమిటీ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: 56 డిపార్టుమెంట్ల కలయికతో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాజమహేంద్రవరం రూరల్ తాలూకా యూనిట్ (కడియం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం)కి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం బొమ్మూరులోని రెవెన్యూ కాలనీలో ఉన్న జిల్లా ప్రధాన కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా టి.శ్రీధర్, ప్రెసిడెంట్‌గా ఎన్‌వీ సత్యనారాయణ రాజు, కార్యదర్శిగా పి.సురేష్, వైస్ ప్రెసిడెంట్లుగా నాగసాయిమౌర్య, మంగి అప్పలనాయుడు, కోశాధికారిగా పి.మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీలుగా పి.శంకరరావు, వి.ఉమామహేశ్వరి నియమితులయ్యారు. నూతన కమిటీలో ఎన్నికైన కార్యవర్గానికి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు గిరిప్రసాద్ వర్మ,సి.హెచ్ఎస్ విల్సన్ పాల్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పి.రవికుమార్ అభినందనలు తెలిపారు.

శాశ్వత లోక్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్లాపస్ చైర్మన్ గాయత్రిదేవి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వైద్య, తపాలా, టెలీఫోన్, బ్యాంకింగ్ వంటి సేవలకు సంబంధించిన సమస్యలను జిల్లా న్యాయస్థానం ఆవరణలో ఉన్న శాశ్వత లోక్ అదాలత్ (ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్) (ప్లాపస్)లో పరిష్కరించుకోవచ్చని ప్లాపస్ చైర్మన్ ఎ.గాయత్రిదేవి చెప్పారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శాశ్వత లోక్ అదాలత్ ప్రజా ప్రయోజన సేవలపై ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గాయత్రిదేవి మాట్లాడుతూ పైతరహా వివాదాల్లో కోర్టు ఫీజు లేకుండా రాజీ మార్గం ద్వారా సత్వర పరిష్కారం పొందవచ్చన్నారు.

న్యాయ సేవలపై అవగాహన

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, ప్రమాద, బ్యాంకు, రాజీపద్ధదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ– లిటిగేషన్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు.

టీబీ పరీక్షలు తప్పనిసరిగా చేయాలి



పంచాయతీ కార్యదర్శులకు గాంధీజీ బ్రాంజ్ మెడల్, సర్టిఫికెట్‌ను అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో టీబీ ప్రిసమ్ప్టివ్ టెస్టులు తప్పని సరిగా చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం స్థానిక ఆనం కళా కేంద్రంలో టీబీ ఫోరం/సొసైటీ, టీబీ ముక్త్ గ్రామ పంచాయతీ అవార్డు ప్రదానోత్సవ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీబీ లక్షణాలు ఉన్నవారిని ముందుగా గుర్తించి సరైన చికిత్స అందించాలని కలెక్టర్ అన్నారు. పంచాయతీ కార్యదర్శుల బాధ్యత, విధుల నిర్వహణలో వారి పాత్రపై ఇటువంటి వేదిక ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో గోల్డెన్ గాంధీ అవార్డు కోసం తమ వంతుగా కార్యదర్శులు ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. స్క్రీనింగ్, పరీక్షలు, నిర్ధారణ, చికిత్స ద్వారా 2025 నాటికి టిబి విముక్తి భారత్ దిశలో ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకుని వెళ్లాలని సూచించారు. టీబీతో మన దేశంలో ప్రతి మూడు నిమిషాలకు ఇద్దరు మరణిస్తున్నారని తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్నవారికి మెరుగైన పోషక విలువలుతో కూడిన ఆహారం అందించడం ద్వారా మాత్రమే సాధ్యం అన్నారు. అందుకోసం మరింత మంది నిక్షయమిత్రాలని గుర్తించి వారి పేర్లు నమోదు చెయ్యాల్సి ఉందన్నారు. టీబీ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశం ఉందని, అయితే సరైన విధానంలో చికిత్సా పొందడం ద్వారా సమూలంగా తొలగించే అవకాశం ఉందని జిల్లా టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర పేర్కొన్నారు. చికిత్సా విధానం, సక్రమంగా మందులు వాడడం ద్వారా మాత్రమే సాధ్యం అవుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి (ఇన్‌చార్జి) ఎం.నాగలత, డ్వామా పీడీ నాగమహేశ్వరరావు, ఐఎంఏ సెక్రటరీ గురుప్రసాద్, డీఈఎంఓ, ఎంఆర్‌సీఏఎస్ సత్యకుమార్, ప్రముఖ పల్మనాలజిస్టులు డాక్టర్ జి.రత్నాకర్, డాక్టర్ ఎ.మేరీ వసంత, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ సాయి, టీబీ ఫోరమ్ జిల్లా సభ్యులు శర్మ తదితరులు పాల్గొన్నారు.

శంభో.. శివశంభో..


బొమ్మూరు గౌరీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు

కిటకిటలాడిన శివాలయాలు

రాజమహేంద్రవరం రూరల్: కార్తికమాసం సందర్భంగా శనివారం పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో శివాలయాలన్నీ కిటకిటలాడాయి. వేకువజామునే భక్తులు సమీపంలోని గోదావరినదీ జలాల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని టి.నగర్‌లో వేంచేసియున్న శ్రీబాలాత్రిపుర సుందరి అన్నపూర్ణసమేత విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామివారికి క్షీరాభిషేకాలు, రుద్రాభిషేకాలు, కుంకుమార్చనలు, లక్ష పత్రిపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శోభారాణి తెలిపారు. బొమ్మూరు గౌరీచంద్రమౌళీశ్వరస్వామి వారి ఆలయంలో కార్తికమాస పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆకాశదీపం వెలిగించారు. అలాగే మండలంలోని పలు శివాలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.


గోదావరి ఘాట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

కార్తిక స్నానాలకు ఘాట్‌లు సిద్ధం

రాజమహేంద్రవరం సిటీ: కార్తికమాసంలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా గోదావరి ఘాట్‌లను సిద్ధంగా ఉంచాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక గోదావరి ఘాట్‌లను, రేవులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తికమాసం సందర్భంగా రాజమహేంద్రవరం వాసులే కాకుండా నగరం చుట్టుపక్కల గ్రామాల నుంచి పుణ్యస్నానాలు ఆచరించడానికి భక్తులు వచ్చి విశేష సంఖ్యలో తరలివస్తారన్నారు. దుస్తులు మార్చుకొనే గదులు అన్ని రేవులలో ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అవసరమైన చోట షవర్లు పనిచేసేలా చూడాలన్నారు. పర్యటనలో ఇన్‌చార్జ్ ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానరు కోటయ్య, డిప్యూటీ సిటీ ప్లానరు సత్యనారాయణ రాజు, మున్సిపల్ ఆరోగ్య అధికారిణి ఎ.వినూత్న,శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇంజనీరింగు, శానిటేషన్, టౌన్ ప్లానింగు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: బఘీర
సూర్యమినీ	: జనక అయితే గనక
సూర్యప్యాలెస్	: లక్కీ భాస్కర్
శివజ్యోతి	: క
అనుశ్రీ	: క
స్వామి	: అమరన్
అశోక	: లక్కీ భాస్కర్
రాజా	: అమరన్
రంభ	: భూల్‌భులాయియా–3
ఊర్వశి	: అమరన్
మేనక	: విశ్వం
కుమారి	: దేవర
అప్సర నామవరం	: లక్కీ భాస్కర్
వీఎస్.మహల్ ధవళేశ్వరం	: లక్కీ భాస్కర్, క
మురళీకృష్ణ కడియం	: లక్కీ భాస్కర్
వెంకటసూర్య	: లక్కీ భాస్కర్